ప్రజాశక్తి
గురువారం 26 డిసెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

జోరువానలో కొనసాగిన నిరసన

పార్వతీపురం : వారంరోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షంలోనూ గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు దీక్షలు కొనసాగించారు. ఉపాధ్యాయులు ఇందిరా కుమారి, దీపరాణి, కామేష్, శివ, శంకర్ రావు, రంగారావు, మురళి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్టంలో కూటమి ప్రభుత్వం గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల విషయంలో కుంభ కర్ణ నిద్రలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. . ఇప్పటికైనా నిద్ర వీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గిరిజన విద్య, మిధ్యగా మారుతోందని తెలిపారు.

అన్నదాత కంటతడి

వరుస తుపాన్లతో పొలాల్లో ఉన్న వరిచేలు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో చేతికందాల్సిన పంట కళ్ల ముందు నీటిపాలవ్వడం పట్ల అన్నదాత కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నూర్చిన ధాన్యం రంగు మారే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. వీటితో పాటు అపరాలు, మొక్కజొన్న, మిరప పంటలు కూడా దెబ్బతింటున్నాయి. ఆర్థికంగా ఆదుకుంటాయని ఆశించిన రైతులకు వరుస తుపాన్లు నిరాశే మిగిల్చాయి. జిల్లాలో బుధవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం గంటల వరకు 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మక్కువ మండలం సాంతేశ్వరంలో నీటిమునిగిన వరిపనలను బయటకు తీస్తున్న రైతులు

- నీటిపాలవుతున్న అపరాలు
- ఇవకపట్టిన మిరప, మొక్కజొన్న
- కంటతడి పెడుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి -వీరఘట్టం/ మక్కువ/ గరుగుబిల్లి

వీరఘట్టం మండలంలోని కొట్టుగుమ్మడలో వరిసేలు కోతలు కోయకుండా విడిచిపెట్టడంతో పంట నేలకొరిగింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి రేయిం బవుళ్లు ఎంతో శ్రమించి పంటలు సాగు చేసిన పంట నీటపాలవుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మిరప పంటకు తీవ్ర నష్టం వాటిలినట్లు రైతులు వాపోతున్నారు ఎకరాకు రూ.40వేలు నుంచి రూ.50వేలకు పెట్టుబడులు పెట్టామని, పువ్వు వచ్చే దశలో వర్షాలు అధికంగా కురుస్తుండడంతో పువ్వు నేలరాలడంతో పంటకు నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు.

గరుగుబిల్లి : మండలంలోని పెద్దూరు, ఉద్దవోలు, పెదగుడబ, చిన్నగూడబ, ఇతర గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వేలకు వేల రూపాయలు మదుపు పెట్టి మొక్కజొన్న, అపరాల సాగు చేశారు. అయితే ప్రకృతి కొన్నెర్ర చేయడంతో తమ ఆశలపై నీరు పోసినట్టయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దూరుకు చెందిన వంగపండు రామినాయుడు ఇటీవల మొక్కజొన్న సాగు చేయగా, ఈ వర్షాలకు పంట అంతా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దూరు, చినగుడబకు చెందిన రైతులు వేసిన అపరాలు నీటి మునగడంతో తీవ్ర నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీతానగరం : మండలంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరిచేలు కోతలు కోసి నూర్పులు చేస్తున్న తరుణంలో తుఫాను కారణంగా కొంతమంది రైతుల పంట పొలాల్లోనే దిబ్బలు వేసుకున్నారు. అయినా పంటల తడిచిపోయి, ధాన్యం రంగుమారే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలతో అపరాల పంటలైన మినుము, పెసర, మొక్కజొన్న కూడా దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో మొక్కలు పోతాయని రైతులు చెబుతున్నారు.

మక్కువ : గత నాలుగు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు ఒకవైపు వరిచేలకు మొలకలు వస్తుండగా మరోవైపు పాతకాలపు డాబా ఇళ్ల నుంచి నీళ్లు ఏకధాటిగా కారుతుండడంతో నివసిస్తున్న ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మక్కువ పంచాయతీ సాంతేశ్వరం గ్రామానికి చెందిన మచ్చ సోమనాయుడు గుండాలమ్మకు చెందిన వరి పైరు పూర్తిగా తడిసి ముద్దగా మారడమే కాకుండా మొలకలు కూడా రావడంతో రైతులు దిగులుచెందుతున్నారు. సుమారు మూడున్నర ఎకరాల వరి చేను పూర్తిగా దెబ్బతిందని వాపోతున్నారు. అలాగే కోన పంచాయితీ ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన డాబా ఇళ్లు స్లాబులు లీకులు ఇవ్వడంతో ఏకధాటిగా నీరు కారుతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఒప్పంగి పారమ్మ, సీతమ్మ, గౌరమ్మ, యశోద, కొర్ర లక్ష్మి తదితరులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు, గృహాలు దెబ్బతిన్న గిరిజనులు కోరుతున్నారు.

పార్వతీపురంలో అత్యధికంగా 22.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు

జిల్లాలో బుధవారం అత్యధికంగా పార్వతీపురం మండలంలోని 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పాలకొండ మండలంలో 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల వర్షపాతం వివరాలిలా ఉన్నాయి.

గుమ్మలక్ష్మీపురం 21.2మిల్లీమీటర్లు నమోదు కాగా, కురుపాంలో 20.6, బలిజిపేటలో 18.8, గురుగుబిల్లిలో 15.6, జియ్యమ్మవలసలో 13.4, సీతంపేటలో 9.4, భామినిలో 9.6, కొమరాడలో 11.6, సీతానగరంలో 6, సాలూరులో 5.8, మక్కువలో 12.2, పాచిపెంటలో 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గరుగుబిల్లి మండలం పెద్దూరులో నీట మునిగిన మినప పంట

రిజర్వాయర్లకు జలకళ

పెదగెడ్డ రిజర్వాయర్‌లో చేరిన వరదనీరు

గత పది రోజులుగా అల్ప పీడన ప్రభావాలతో జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిండిపోయాయి. తాటిపూడి రిజర్వాయరులో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరింది. రిజర్వాయరు పూర్తి స్దాయి మట్టం 297 అడుగులు కాగా, ప్రస్తుతం 295.40 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 450 క్యూసెక్కులు కాగా, ఒక గేటు ఎత్తివేసి 350 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ఆంధ్ర ప్రాజెక్టు నీటి మట్టం పూర్తిసామర్ధ్యం 146మీటర్లు కాగా, ప్రస్తుతం 143.15మీటర్లు నీరు ఉంది. ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కులు వస్తోంది. 25 క్యూసెక్కుల నీటికి దిగువకు విడిచిపెడుతున్నారు.

-తోటపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 344.49 అడుగులు కాగా, ప్రస్తుతం 342.81 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 410 క్యూసెక్కుల నీరు వస్తుంది. అవుట్ ఫ్లక్ష 690 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది.

- మడ్డువలస రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 65మీటర్లు కాగా, ప్రస్తుతం 64మీటర్లకు చేరింది.

- వెంగళరాయ సాగర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 161మీటర్లు కాగా, ప్రస్తుతం 160.40మీటర్లకు చేరింది.

- వట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిస్థాయి సామర్ధ్యం 121.62మీటర్లు కాగా, ప్రస్తుతం 111.31మీటర్లకు చేరింది.

- పెద్దగెడ్డ రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం పూర్తిస్థాయి సామర్ధ్యం 13.8 మీటర్లు కాగా, ప్రస్తుతం 211.6 మీటర్లకు చేరింది.

వీరఘట్టం మండలం ఎం.రాజపురంలో అర్ధాంతంగా నిలిచిపోయిన రోడ్డు

నత్తనడకన పల్లెపండగ పనులు

102 పనులకు గాను 33 పూర్తి

దబ్బగెడ్డ, చెముడు పనులపై సర్పంచుల నోటీసులు

ప్రజాశక్తి - మక్కువ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అట్టహాసంగా చేపట్టిన పల్లె పండగ పనులు మండలంలో నత్త నడకన సాగుతున్నాయి. సుమారు రూ. 633 కోట్ల ఉపాధి హామీ నిధులతో 21 పంచాయతీల్లోని సుమారు 102 పనులకు ప్రతిపాదనలు పంపించారు. పనులు మంజూరైనప్పటికీ సర్పంచుల అనుమతులు తీసుకోకుండా పనులు చేపట్టడంపై మండలంలో వైసిపి సానుభూతి సర్పంచులంతా ఆగ్రహంతో ఉన్నారు స్థానిక ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపి పలు పంచాయతీల్లో ఇప్పటివరకు 33 పనులు పూర్తి చేశారు. చెముడు, దబ్బగడ్డ పంచాయతీల సర్పంచులు ఇటీవలే తమ పరిధిలో ఉన్న పనులపై అధికారులకు లీగల్ నోటీసులు పంపించారు. ఈ నేపథ్యంలో పలు పంచాయతీల్లో పనులు ప్రారంభించేందుకు వెండర్లు ముందుకు రావడం లేదు. మండల కేంద్రం మక్కువలో సుమారు 17 పనులు మంజూరు కాగా ఒక్క పని మాత్రమే పూర్తికా వచ్చింది. మిగిలిన 16 పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. ప్రస్తుతం జరిగిన జరుగుతున్న పనులకు సంబంధించి బిల్లులు మంజూరు లో కూడా జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సంక్రాంతి సమీపిస్తున్నా పనులు మాత్రం పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు.

రూ 8.4 కోట్లతో పల్లె పండగ పనులు

వీరఘట్టం : మండలంలోని రూ 8.4 కోట్లతో పల్లె పండగ పనులు ఉపాధి హామీ ద్వారా చేపట్టాలని నిర్ణయించినట్లు ఐటిడిఎ ఎఇఇలు కె.నాగభూషణ్, సింధుజ తెలిపారు. చిదిమి రహదారికి రూ కోటి 20 లక్షలు, పివిఆర్ పురం-తూడి రహదారికి రూ.2 కోట్లు, చిదిమి బిటి రహదారి నుండి సిఎస్ఆర్ పేట గ్రామం వరకు రూ.30 లక్షలు, అడారు బిటి రహదారి నుండి డిపివలస గ్రామం వరకు రూ.50 లక్షలు, బిటివాడ బిటి రహదారి నుండి బియ్యంవలస వరకు రూ 40 లక్షలతో బిటి రహదారి నిర్మాణ పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇంకా రాజపురం, -కత్తుల కవిటి, కంబర, వట్టిగెడ్డ వంతెన నుంఇచ గుమ్మడ గ్రామం వరకు రహదారుల పనులు చేపట్టాల్సి ఉంది.

కురుపాం : కురుపాం మండలంలో పల్లె పండగ పనులకు రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపగా రూ.6.55కోట్లు మంజూరయ్యాయి. ఐటిడిఎ పరిధిలో రూ.5.25కోట్ల నిధులు మంజూరు కాగా, 80శాతం పనులు పూర్తయ్యాయి. పంచాయతీరాజ్ నుంచి మంజూరైన 1 కోటి 30 లక్షల్లో, 20 లక్షలతో జరిగిన సిసిరోడ్లు, కాలువలు 85శాతం వరకు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మక్కువ మండలం డి.శిర్లాంలో జరుగుతున్న కాలువ పనులు

కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీరురాజు

పారిశుధ్య కార్మికులతో క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

క్రిస్మస్‌ను పురస్కరించుకొని బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజుతో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా, ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే మతపరమైన, సాంస్కృతిక పండుగని, కార్మికులంతా మతాలకతీతంగా సోదరభావంతో మెలగాలని, మతోన్మాదపు దాడులను అరికట్టేందుకు కార్మికులంతా ఐక్యంగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య యూనియన్ నాయకులు ఎన్ శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, బి.రాజేష్, బంగారు రవి, మంగళగిరి శ్రీను, గంగేలు, పాపమ్మ, ఇప్పలమ్మ, సుజాత, జి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాల అమలుకు దశలవారీ పోరాటం

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదని, అందువల్లే 2023 డిసెంబర్ 26 నుంచి 16 రోజులు సమ్మె జరిగి గురువారానికి ఏడాది పూర్తవుతుందని మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు తుపాకుల రాముడు, రవి, లక్ష్మి, బుజ్జి తెలిపారు. ఆ ఒప్పందాలు అమలు చేయడంలో ప్రస్తుత అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం నుంచి దశల వారీగా ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. మున్సిపల్ వర్కర్ల 16 రోజుల సమ్మె కాలం సందర్భంగా రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75వేలు, ప్రమాద బీమా రూ.7లక్షలు, దహన సంస్కార ఖర్చులు రూ.20వేలు, ఇంజినీరింగ్ కార్మికులకు పెంచాల్సిన వేతనాలు పెంచుతూ జీవోలు ఇస్తామని అధికారులు కూడా మినిట్స్ రాసుకున్నారని తెలిపారు. ఆ మినిట్స్ కాపీని నేటికీ కార్మికులకు జీవోల రూపంలో ప్రభుత్వం ఇవ్వడం లేదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేస్తామని మంత్రి లోకేష్, ఇతర మంత్రులు ఎన్నికల ముందు ప్రకటించారని, ఆ హామీని నెరవేర్చాలని గురువారం ధర్నాలు, జనవరి 11న దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ఆందోళనలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆందోళన కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ కార్మికులు

567 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 567 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, మిగిలిన రెవెన్యూ గ్రామాలోనూ పక్కాగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ సమస్యలతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సేవలను కూడా ఉచితంగా అందజేయవచ్చని ఆయన చెప్పారు. వీటిపట్ల రెవెన్యూ అధికారులు దృష్టి సారించి ప్రజలకు వివరించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పార్వతీపురం డివిజన్లో 244, పాలకొండ డివిజన్లో 323 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించడం జరిగిందని ఆయన చెప్పారు.

గ్రామ సభల్లో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని, వాటికి వెంటనే రసీదుని జారీ చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ మాడ్యూల్‌లో అన్ని ఫిర్యాదులను నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. క్షేత్ర సందర్శనతో సహా ప్రతి ఫిర్యాదును సమగ్ర విచారణను నిర్వహించి, ఎపరిష్కరించాలని స్పష్టం చేశారు. తహశీల్దార్ నేతృత్వంలోని బృందం విచారణకు వెళ్లే షెడ్యూలు ముందుగా తెలియజేయాలని ఆయన అన్నారు. గ్రామంలో రీ-సర్వే చేసి ఉంటే, కొత్తగా తయారు చేసిన ఆర్ఓఆర్‌ను గ్రామంలో చదివి, అభ్యంతరాలు ఏవైనా ఉంటే పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. కోర్టు కేసులను, ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, వ్యాజ్యం ఉన్న ప్రజానీకం తమ సమస్యలను తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారికి పరిష్కారానికి అభ్యర్థించవచ్చని ఆయన అన్నారు. తహసీల్దార్ లు పిర్యాదుదారులు దాఖలు చేసిన అఫిడవిట్ కాపీని తీసుకోవాలని ఆయన సూచించారు. వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి బృందం తగిన సూచనలు సలహాలు అందించవచ్చని ఆయన చెప్పారు. సరిహద్దు వివాదాలు ఉంటే, మండల సర్వేయర్‌ను నియమించి భూమిని సర్వే చేయడం ద్వారా పరిష్కరించవచ్చని ఆయన సూచించారు. నిర్ణీత కాలవ్యవధిలో అన్ని గ్రామసభలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

డయేరియా బాధితుల ఇళ్లను సందర్శిస్తున్న అధికారులు

జమ్ములో ఆరుగురికి డయేరియా

అప్రమత్తమైన అధికారులు

ప్రజాశక్తి- గుర్ల

మండలంలోని జమ్ము గ్రామంలో ఆరుగురికి డయేరియా సోకడంతో మండల, జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న డిఎల్‌పిఒ మోహన్ రావు, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, డిఎంహెచ్ జీవన రాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, తహశీల్దార్ ఆదిలక్ష్మి తదితర అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు సంబంధింత అధికారులు లను అప్రమత్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు తదితర వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డయేరియా సోకిన వారిలో వెంపటాపు శ్రీను, రామునాయుడు, నడిపల్లి సన్యాసప్పుడు, జమ్ము సత్యనారాయణమ్మ, గొర్లె స్వామి నాయుడు, కొల్లూరు అనురాధ ఉన్నారు. వీరిలో నలుగురు చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రి లోను ఒకరు తెట్టంగి పిహెచ్‌సిలోను, మరుకొరు జిల్లా కేంద్రాస్పత్రిలోను చికిత్స పొందు తున్నారు. ప్రస్తుతం వీరిలో కొందరికి డయేరియా అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.

క్యాంస పతకం సాధించిన మనోహర్

జాతీయ పోటీల్లో సాలూరు విద్యార్థికి మెడల్

ప్రజాశక్తి - సాలూరురూరల్

జాతీయ స్థాయి సబ్ జూనియర్ క్రీడా పోటీల్లో స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి నితిన్ సాయి మనోహర్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈనెల 19 నుంచి 24 వరకు కాశ్మీర్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున నితిన్ సాయి మనోహర్ పాల్గొన్నాడు. సాఫ్ట్ బాల్‌లో ఆయన పతకం సాధించడంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఆశీర్వాదం, పిడి విద్యాసాగర్, పిఇటి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 22 నుండి 24 వరకు తూర్పుగోదావరి జిల్లా రావుల పాలెంలో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ అంతర్ జిల్లాల బాల, బాలికల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయనగరం బాల బాలికల జట్లు ద్వితీయ స్థానం సాధిం చాయి. వీరి విజయం సాధించ డం పట్ల జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ ఐవిపి రాజు, అధ్యక్షులు రంగారావు దొర , కార్యదర్శి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు, ట్రెజరర్ శివకుమార్ సంఘ సభ్యులు అందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు.

రన్నర్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలుర జట్టు

హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న సిఐ, హెచ్‌సి

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బలిజిపేట పోలీసు స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వర్తించిన భూరి నారాయణస్వామి ఇటీవలే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భార్య భూరి శారదకు బుధవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐ కె.మురళీధర్, ఎస్ఐ ఎం.గోవింద సమక్షంలో వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి రూ.5వేల నగదుతో పాటు బట్టలు అందజేశారు. దీంతో పాటు పట్టణంలోని పలువురు వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు రగ్గులు, స్టీలు గ్లాసులు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఉదారతను సిఐ, ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది కొనియాడారు.

పాత చలానాలు చెల్లించండి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ కూడలిలో బుధవారం వాహనాలు తనిఖీలు ఎస్సై ఎం.రాజేష్ నిర్వహించారు ఈ సందర్భంగా వాహనదారులు పాత చలానాలు, బకాయిలు వెంటనే చెల్లించాలని సూచించారు. అలాగే హెల్మెట్ వాడకంపై ప్రజలకు వివరించారు. అనంతరం ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, పోలీస్ పద్మ మరిపివలస, గుచ్చిమి తదితర గ్రామాల్లో యాప్‌ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా ప్రమాదాలు వచ్చేటప్పుడు ఈ యాప్‌ల ద్వారా ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ సభ్యులు

జెఎఫ్‌ఒల సంఘం జోనల్ కార్యదర్శిగా మనోజ్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీగా మన్యం జిల్లా అటవీ శాఖలోని పార్వతీపురం సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మీసాల మనోజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకోవడం జరిగింది. జోనల్ సెక్రటరీగా ఎన్నికైన మనోజ్ కుమార్‌ను జిల్లా అటవీ శాఖ అధికారి, సెక్షన్ అధికారులు, జూనియర్ ఫారెస్ట్ అధికారులు, అటవీశాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

విద్యుదాఘాతంతో సొమ్మసిల్లిన కార్మికుడు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని కొత్తవలసలో 9వ వార్డు పల్లెంవారివీధి జంక్షన్ వద్ద గల ఐరన్ ఎలక్ట్రికల్ స్తంభానికి విద్యుత్ ప్రసరించడంతో మున్సిపల్ ప్రజారోగ్య విభాగంలో ఆప్కాస్ విధానంలో పారిశుధ్య కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న జలగడుగుల సత్తిరాజు షాక్‌కు గురై సొమ్మసిల్లిపోయాడు. బుధవారం అతడు అదే వార్డులో విధులు నిర్వహిస్తుండగా విద్యుత్ స్తంభానికి అనుకోకుండా తన కాలు తగలగానే కరెంట్ షాక్‌తో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు ఆసుపత్రికి వెళ్లి సత్తిరాజును పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో భాగంగా గత ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికులకు ప్రమాదాలకు గురైతే ఎవరు రక్షణ కల్పిస్తారని, సత్తిరాజుకు నష్టపరిహారం సంబంధిత ఇవ్వాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని, ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి స్ఫూర్తితో పట్టణ, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా నివాళు లర్పించారు. సుపరిపాలనతో దేశ ప్రగతిని కొత్త పుంతలు తొక్కించిన మహనీయులు వాజపేయి అని కొనియాడారు.

ఫైబర్‌నెట్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో వెలుగు చూసిన ఫైబర్ నెట్ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వైసిపి హయాంలో అర్హత, నియామక పత్రాలు లేకపోయినా అడ్డగోలుగా ఫైబర్ నెట్‌లో నియామకాలు చేపట్టారని తెలిపారు. ఫైబర్‌నెట్‌లో నియమించిన ఉద్యోగులతో మంత్రులు ఇళ్ల పనులు చేయించుకోవడం అన్యాయమని, వైసిపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఫైబర్‌నెట్ అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాయితీపై అందుబాటులో ఆనందగజపతి ఆడిటోరియం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కొన్ని సంస్థలకు రాయితీ ద్వారా అందించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియం ప్రస్తుతం నగరపాలక సంస్థ అదీనంలోకి వచ్చిందని తెలిపారు. క్రీడా, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించా లన్న ఉద్దేశంతో ఆనంద గజపతి ఆడిటోరియంను వినియోగించు కునేందుకు రాయితీ ద్వారా అందించాలన్న విషయమై కౌన్సిల్ దృష్టికి తేగా, ఆయా సంస్థలకు 50 శాతం రాయితీ ద్వారా ఇప్పించాలని కౌన్సిల్ తీర్మానించిందని తెలిపారు. ఆడిటోరియాన్ని ప్రైవేటు కార్యక్రమాల నిమిత్తం వినియోగించుకునే పరిస్థితుల్లో రోజుకు రూ.30 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడ, సంగీత, సాహిత్య, సాంస్కతిక, సామాజిక కార్యక్రమాలు కోసం వినియోగించుకునే నిమిత్తం రోజుకు రూ.15వేలు ధరకే రాయితీగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వీరఘట్టంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ రోడ్డు సమీపాన గల గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ డి.రాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏసు క్రీస్తు జన్మదినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ షణ్ముఖరావు క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రిస్మస్ పండగ అంటే చాలా ప్రత్యేకమైందని, ఏసుక్రీస్తు ప్రపంచ యావత్ ప్రజానీకానికి ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రాజారత్నం, ప్రదీప్, జయకుమార్, సుందర్ సుదర్శన్, జాన్, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. మండలంలోని పెదబోగిలి, చినబోగిలి, లచ్చయ్యపేట, గాదెలవలస, అంటిపేట, నిడగల్లు, మరిపివలస, గుచ్చిమి, బూర్జ, పెద్ద అంకలాం, జోగింపేట, కాసాయిపేటలో క్రిస్మస్ వేడుకలు జరుపుకొని అనంతరం ర్యాలీలు నిర్వహించారు. క్రైస్తవ మత పెద్దలు ముందుండి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పెద్దలు మత విశ్వాసులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దబొండపల్లి, తాళ్లబురిడి, నర్సిపురం, ఎమ్మార్ నగరం, బాలగొడబ, తదితర గ్రామాల్లో చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శుభాకాంక్షలు తెలియజేయగా, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

సీతంపేట : ఏజెన్సీలో క్రీస్తు జన్మదిన సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పత్తికగూడ, సోమగండి, సీతంపేట తదితర ప్రాంతాల్లో గల చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వీరఘట్టం: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బాప్టిస్ట్ దేవాలయంలో జరిగిన వేడుకల్లో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పొదిలాపు కష్ణమూర్తి నాయుడు, తెలుగు బాప్టిస్ట్ దేవాలయ అధ్యక్షులు కళింగ ప్రేమభూషణరావు, మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షులు బల్ల హరిబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు ఎస్ అచ్యుతరావు, సాయి పవన్ , అభిమానులు, కార్యకర్తలు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

సీతానగరం వీధుల్లో ఏసుక్రీస్తు ప్రతిమను ఊరేగిస్తున్న క్రైస్తవులు

మక్కువ: క్రిస్మస్ పండగ సందర్భంగా మండలంలోని చర్చిలన్నీ క్రైస్తవుల ప్రార్థనలతో మారుమోగాయి. కాకినాడ నుంచి పాస్టర్ రామకష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీస్తు బోధనలను తెలియజేశారు. కార్యక్రమంలో పాస్టర్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భామిని : స్థానిక ఆర్‌సిఎం చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రార్థనలు నిర్వహించి, ఏసు ప్రభువుని కీర్తిస్తూ పాటలు పాడి, నృత్యాలు చేసారు. సర్పంచ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లోపింటి రాజేష్, చింతాడ చరణ్, కవిటి రాజు, చర్చి నిర్వాహకులు కాంతారావు ఉన్నారు.

భామినిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు; కురుపాం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

ఇదేనా అభివృద్ధి?

- అంధకారంలో ఆదివాసీ తండాలు
- చీకటిలో జీవనం సాగిస్తున్న గిరిజనులు
- తప్పని కరెంట్ కష్టాలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వాలు మారినా పరిపాలన మారలేదు. ప్రజాప్రతినిధులు మాత్రం అంత అభివృద్ధి చేశాం... ఇంత అభివద్ధి చేశామని.. గొప్పలు చెబుతున్నారు కానీ ఇప్పటికీ విద్యుత్, తాగునీరు, సాగునీరు వంటి అనేక సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. కంప్యూటర్ యుగంలో నేటికీ విద్యుత్తు లేని గ్రామాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రీవెన్స్‌లో గిరిజనులు వినతులు సమర్పించిన ప్రయోజనం కనిపించలేదు. ఆఖరుకు ఏమీ చేయలేక చీకట్లోనే కొండలపై విషపూరిత జంతువుల మధ్య గిరిజనులు జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర అవస్థలుపడుతున్నారు.

ఏజెన్సీలో పివి ఈతమానుగూడ పంచాయతీ గూడంగి గిరిజన గ్రామంలో సుమారు 22 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎత్తైన కొండపైన గూడంగి ఉండడంతో ఆ చుట్టుపక్కల వారు పోడు వ్యవసాయం ఉండడంతో అక్కడే వాళ్ల ఉంటూ

జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం హయంలో ఎటువంటి విద్యుత్ సౌకర్యం కల్పించలేకపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ ఏటువంటి చర్యలు తీసుకోలేదు. విద్యుత్ లేక కొవ్వొత్తు, నూనెబుడ్డెలను మార్చి ఎన్నో ఏళ్లుగా కాలం వెళ్లబుచ్చుతున్నామని గ్రామస్తులు అప్పారావు, ఊయక సునీత, గౌరి, సూర్యారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఐటిడిఎ గ్రీవెన్స్‌లో ఎన్నో మార్లు వినతులు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. గతంలో అధికారులు సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ అందిస్తామని ప్రతిపాదనలో తయారుచేసినా అది కూడా మూలకు చేరింది. మర్రిపాడు పంచాయతీ పాతపెద్దగూడలో ఆరు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడి గిరిజనులకు కూడా కరెంటు కష్టాలు తప్పడం లేదు. అలాగే కుసిమి పంచాయతీల యరకరాయిగూడలో 20 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామానికి కూడా విద్యుత్ సౌకర్యం లేదు. వర్షాకాలంలో మరింత దయనీయంగా వీరి పరిస్థితి మారుతుంది. కంప్యూటర్ యుగంలో విద్యుత్తు సౌకర్యం లేదంటే మన అధికారులు, పాలకుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకులు స్పందించి తమ గ్రామాలకు విద్యుత్తు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫోన్ ఛార్జింగ్‌కు పక్క గ్రామానికి వెళ్లాల్సిందే...

తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఆఖరుకు ఫోన్ ఛార్జింగ్‌కు కూడా పక్క గ్రామానికి వెళ్ళాల్సి పరిస్థితి దాపురించింది. ఇప్పటికీ అధికారులు సందర్శించినప్పటికీ విద్యుత్తు వేయలేదు. విద్యుత్ లేకపోవడంతో రాత్రులు చాలా ఇబ్బంది పడుతున్నాం. ఒకవైపు దోమలతో నానా ఇబ్బందులు పడుతున్నాం.

అప్పారావు,
గిరిజనుడు, గూడంగి

గ్రీవెన్స్‌లో వినతులిచ్చినా ప్రయోజనం లేదు

ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని గ్రీవెన్స్‌లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించినా ప్రయోజనం కనిపించలేదు. మా గ్రామాలను పాలకులు, అధికారులు సందర్శించినప్పటికీ ఇంతవరకు మా పంచాయతీలో గూడంగి గ్రామానికి విద్యుత్ అయితే రాలేదు.

- పత్తిక వీరన్న, సర్పంచ్,
పివి ఈతమానుగూడ పంచాయతీ

ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలో గూడంగి, యరకరాయిగూడ, పాతపెద్దగూడ, పివిటిజి గిరిజన గ్రామాలకు విద్యుత్తు లేదు. ఎత్తైన కొండలపై ఉండడంతో పాటు రోడ్డు సౌకర్యం లేక విద్యుత్ స్తంభాలు పైకి వెళ్లడం కష్టంగా ఉంది. సిఎండి దృష్టికి తీసుకెళ్లాం. గూడంగికి, పాత పెద్దగూడకు గతంలో రోడ్డు లేదు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించాం.

గోపాలకృష్ణ, డిఇ
విద్యుత్ డివిజనల్ కార్యాలయం పాలకొండ

కలెక్టర్ ఆదేశించినా చర్యలు తీసుకోరా?

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెలుగు ఎపిఎం, సిసిలపై చర్యలకు జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ అధికారుల్లో చలనం లేదని మండలంలోని రావికోన పంచాయితీ గిరిజన స్వయం సహాయక బృందం మహిళలు, స్థానిక గిరిజన సంఘ నాయకులు విమర్శించారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ బంగారమ్మ పొదుపు సంఘ సమావేశం ఏర్పాటు చేసి విఎను నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ 8నెలలుగా గ్రామ సంఘ సమావేశం నిర్వహించకుండా సిసి, ఎపిఎం కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. వీరి చర్యలను గమనిస్తే రాజకీయ ఒత్తిళ్లకు లొంగి లాలూచీపడినట్లు కనబడుతుందని తెలిపారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే సంబంధించిన వారిపై చర్యలు తీసుకొని సమావేశం నిర్వహించి విఎను నియమించాలని ఆదేశించినప్పటికీ ఎపిడి ఈ విషయంలో తాత్సారం చేస్తున్నారని అన్నారు. ఒక గిరిజన పంచాయితీలో వేరొక పంచాయతీకి చెందిన గిరిజన కాని వారిని నియమించాలని సిసి ఎలా ఆలోచించారని అంటే చేతివాటం ఉందన్నది స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. అయినా కలెక్టర్ సిసిని సస్పెండ్ చేయమని చెప్పినా ఎపిడి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సబబు, ఇన్ని నెలలు ఎందుకు కాలయాపన చేస్తున్నారో అర్థం కావడంలేదని అన్నారు. ఇప్పటికైనా గ్రామ సంఘం సమావేశం ఏర్పాటు చేసుకొని విఎను నియమించాలని కోరుతున్నారు. కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి, గిరిజనుల సమస్యను పరిష్కరించకుండా వ్యవహరిస్తున్న ఎపిడి, ఎపిఎం, సిసిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమావేశంలో గిరిజనులు కె.గంగన్న, కె.శంకర్రావు, హిమరిక లక్ష్మణరావు, పి.శ్రీరాములు, కె.ప్రసాద్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిలో విజయనగరం ప్రభుత్వ డిగ్రీకాలేజికి చెందిన పి.వసంత 100, 200 మీటర్లు, ఎంఆర్ కళాశాలకు చెందిన ఎస్.శ్రావణి 200,400 మీటరు శ్రీనివాస కళాశాలకు చెందిన వి.భార్గవి 100 మీటర్లు, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.హరీష్ 5వేలు, 10వేలు మీటర్లలో ఎంపికయ్యారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.

శ్మశానవాటికలకు రహదారుల నిర్మాణం

పనులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ పి.గౌరునాయుడు, నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామంలో శ్మశాన వాటికలకు రహదారుల నిర్మాణమే ప్రధాన ఎజెండా అని కొండకరకాం మాజీ సర్పంచ్ పాంద్రంకి గౌరునాయుడు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో గ్రామంలో మూడు శ్మశాన వాటికలకు రహదారులను నిర్మిస్తున్నట్టు తెలిపారు. గౌరమ్మ పంప్‌హౌస్ నుంచి కిలారి వీధి శ్మశానవాటికకు రూ.22 లక్షలతో 561 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కిలారివీధి శ్మశానవాటికకు రూ.11.3 లక్షలతో 280 మీటర్ల పొడవున రోడ్డు, భోగారపువీధి శ్మశానవాటికకు రూ.4.5 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొండవెలగాడ, కొండకరకాం మధ్యలో రూ.13.50 లక్షలతో 35 మీటర్ల సిసి రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కొండపల్లి రమణ ఇంటి దగ్గర నుంచి రెండు వైపులా కాలువలను రూ.3.92 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. శివాలయం నుంచి పోతయ్యబంద వరకు రూ.2.45 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా సిసి కాలువలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కనకరాజు ఇంటి దగ్గర నుంచి దేవర చెట్టు వరకు రూ.2.50 లక్షలతో 55 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. మంచాల పుడయ్య ఇంటి దగ్గర నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రూ.11.25 లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో మొత్తం ఎనిమిది అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులను ఆయనతోపాటు ఎంపిటిసి మాజీ సభ్యులు రాంబార్కి రామునాయుడు, టిడిపి నాయకులు కిలారి సూర్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

సిసి కాలువ పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు చొప్ప రామారావు, తదితరులు

కోరుకొండపాలెంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మండలంలోని కోరుకొండపాలెం గ్రామంలో 42 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు టిడిపి నాయకులు చొప్ప రామారావు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో గ్రామంలో ఆరు కాలువలు, నాలుగు సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 789 మీటర్ల పొడవు మేర డ్రెయిన్లు, 170 మీటర్ల పొడవు మేర సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉండేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధి హామీ నిధులతో గ్రామంలో వీధి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రూపురేఖలు మారుతాయని వివరించారు. అంతేకాకుండా గ్రామంలో సగానికి పైగా డ్రెయిన్లను చెరువుకు అనుసంధానం చేయడం వల్ల మురుగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

నిధులున్నా.. అభివృద్ధి సున్నా

బురదమయమైన కూరగాయల మార్కెట్ ఆవరణ

ప్రజాశక్తి - రామభద్రపురం

అంతర్జాతీయ మార్కెట్‌గా పేరొందిన రామభద్రపురంలోని కూరగాయల మార్కెట్లో నిధులున్నా.. అభివృద్ధి సున్నా అన్న చందంగా మారింది. చిన్నపాటి వర్షానికే మార్కెట్ మొత్తం బురదమయం అవుతోంది. అమ్మకాలు, కొనుగోళ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అటు రైతులు, ఇటు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్కెట్‌కు ఏటా ఆశీల రూపంలో లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. కానీ, వసతుల కల్పనలో రిక్త హస్తం చూపిస్తున్న అధికార యంత్రాంగం తీరుపై రైతన్నలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మార్కెట్ మొత్తం బురదమయమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ గొడుగు నీడలోనే ఉంటూ కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వసతులు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులుగా ప్రసాదరావు

ప్రజాశక్తి-కొత్తవలస

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కొత్తవలస తాలూకా అధ్యక్షులుగా జెవి ప్రసాదరావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రామలక్ష్మణ్ అధ్యక్షతన బుధవారం ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ మాట్లాడుతూ జిఒ 1207 ద్వారా నియమించిన కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను ఇటీవల తొలగించడం బాధాకరమన్నారు. వారిని ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు సంఘటితంగా పనిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రమణను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ తాలూకా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, సభ్యులు రమణమ్మ, సూరిదేముడు, రమణ, కళావతి, స్వర్ణ, భాగ్యలక్ష్మి, సత్యారావు, సూర్యారావు, కృష్ణంనాయుడు, శంకరరావు పాల్గొన్నారు.